క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని 25వ డివిజన్ రిక్కాబజార్‌లో బుధవారం ఇందిరమ్మ ఇళ్లకు రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు, డివిజన్ మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నరసింహారావు ఆధ్వర్యాన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల రుణ మంజూరు చేసిన సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరు ఆదేశాలమేరకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి పూర్ణ, నాగిశెట్టి రాధాకృష్ణ, నాయకులు గిరి, వీరన్న, కృష్ణ, లబ్ధిదారులైన ముదులాగర్ మౌనిక, సుమంత్, శంకరి భాయ్, డివిజన్ ఆఫీసర్ నిరోష తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ ముసాయిదా తుది జాబితా విడుదల

నేలకొండపల్లి: మండలంలోని మండల ప్రాదేశిక నియోజకవర్గాల ముసాయిదా తుది జాబితాను బుధవారం అధికారులు వెల్లడించారు. మండలంలోని 18 ఎంపీటీసీలకు సంబంధించినముసాయిదాను 32 జీపీ కార్యాలయాల్లో ప్రకటించారు. అలాగే మొత్తం 49,533 ఓట్లు, 95 పోలింగ్ కేంద్రాలను ప్రకటించగా.. జాబితాలను ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఎంపీఓ శివలు పర్యవేక్షించారు.

వరిలో సస్యరక్షణ చర్యలు పాటించాలి

కూసుమంచి: మండలంలోని భగవత్‌వీడు గ్రామంలోని వరి పొలాలను బుధవారం ఏఓ రామడుగు వాణి పరిశీలించారు. వరిలో కాండం తొలిచే పురుగు ఉధృతిని గమనించి దాని నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. వరిలో కాండం తొలిచే పురుగు సోకినప్పుడు పొట్టదశలో ఉన్న పంటలో గింజలు తాలుగా మారుతాయనిపేర్కొన్నారు. రైతులు ఎప్పటికప్పుడు పంటను గమనించి వ్యవసాయాధికారుల సూచనలతో సస్యరక్షణ చర్యలు పాటించి అధిక లాభాలు పొందాలని సూచించారు. ఏఈఓలు సౌమ్య, రవిందర్ పాల్గొన్నారు.

గణపతి స్వామి జయంతి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ఇందిరానగర్ బాల గణపతి దేవాలయంలో బుధవారం గణపతి స్వామి జయంతితో పాటు సంకటహర చతుర్థి పర్వదినం సందర్భంగా బుధవారం స్వామి వారికి 21 రకాల పుష్పాలతో విశేష అభిషేకాల పూజలు నిర్వహించారు. దేవాదాయశాఖ ఈఓ వీ.వీ.నరసింహారావు, చైర్మన్ బాజిన్న వీర య్య, ప్రధాన అర్చకులు గిరిధర్ ఆధ్వర్యాన వే డుకలు జరుపగా హాజరైన భక్తులకు దాత మావిళ్ల వెంకటరెడ్డి, సబిత దంపతుల కుమారుడు ఆది కేశవ రెడ్డి అల్పాహార విందు ఏర్పాటు చేశారు.

యూరియా పంపిణీకి మరికొన్ని కేంద్రాలు

రఘునాథపాలెం: మండల పరిధిలో రైతులకు యూరియా పంపిణీకి ప్రధాన కేంద్రాలుగా మంచుకొండ, రఘునాథపాలెం, వి.వెంకటాయపాలెం సొసైటీల పరిధిలో కొనసాగుతుండగా రైతుల సౌకర్యార్థం కొత్తగా మరికొన్ని సబ్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇకనుంచి చిమ్మపూడి, ఈర్లపూడి, చింతగుర్తి ప్రాంతాల్లో యూరియను అందించనున్నారు.

నూతన కమిటీ ఎన్నిక



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జీపీఏటీ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోగా.. సంయుక్త అధ్యక్షులుగా కనపర్తి వెంకటేశ్వర్లు, ఐ.వీ.భాస్కరాచారి, ఉపాధ్యక్షులుగా పెదమళ్ల సత్యనారాయణ, కొలికొండ శరత్‌బాబు, ఊడుగు వెంకటేశ్వర్లు, వి.మేరి ఏసుపాదం, కృష్ణకుమారి, తాడి అంజలి, జి.లక్ష్మీసుజాత, కె.అన్నమ్మ, ఆర్.వీ.లక్ష్మీనర్సమ్మ తదితరులు ఎన్నికయ్యారన్నారు. మొత్తం 33 మందితో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పెన్షనర్ల సమస్యలపై పోరాట కార్యాచరణతో ముందుకు సాగనున్నట్లు కమిటీ బాధ్యులు తెలిపారు. ఎన్నికల అధికారిగా వి.రామ్‌మనోహర్, తుమ్మా వీరయ్యలు వ్యవహరించగా.. రాష్ట్ర పరిశీలకులుగా జి.వీరస్వామి, కె.సుధీర్ బాబులు హాజరయ్యారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఘాటి
వినోద	కొత్త లోక, మహావతార్ నరసింహా
సాయిరాం	మదరాసి
ఆదిత్య	ద కంజూరింగ్: లాస్ట్ రైట్స్
శ్రీనివాస	లిటిల్ హార్ట్స్, వార్ 2

- ఖమ్మంగాంధీచౌక్

ఫలితమివ్వని ప్రణాళిక..



48వ డివిజన్ వెంకటేశ్వరనగర్ ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు



బైపాస్‌రోడ్డులోని కొత్త బస్టాండ్ పక్కన గుంతలో నిలిచిన నీరు

పేరుకే వంద రోజుల ప్రణాళిక
- నామమాత్రంగా పారిశుద్ధ్య పనులు
- మురుగు నీరు, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న ఖాళీ స్థలాలు
- అవస్థలు పడుతున్న ప్రజలు

ఖమ్మంమయూరిసెంటర్: నగర ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన '100 రోజుల ప్రణాళిక' పారిశుద్ధ్య కార్యక్రమం ఖమ్మంలో ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. పట్టణాలు, నగరాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రణాళికను రూపొందించగా.. కార్యక్రమ అమలు కోసం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు లేవనే విమర్శలు ఉన్నాయి. ఇక ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతో చెత్తను రోడ్ల వెంట వేస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని డివిజన్లలో వారానికోసారి కూడా చెత్త సేకరణ జరగడం లేదని స్థానిక ప్రజలు పేర్కొంటుండడం గమనార్హం.

అమలులో వైఫల్యం..

ప్రభుత్వం పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి నగరాలను పరిశుభ్రంగా ఉంచడానికి పటిష్టమైన



రమణగుట్టలోని ఖాళీ స్థలంలో నిలిచిన నీరు

ప్రణాళికను రూపొందించింది. ఇందులో భాగంగా రోడ్ల వెంట ఉన్న చెత్తను తొలగించడం, ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను నరికివేయడం, మురుగునీరు నిలిచిపోకుండా చూడడం వంటి పనులు చేపట్టాలని నిర్దేశించింది. ఉన్న పారిశుద్ధ్య కార్మికులకు అదనంగా కార్మికులను నియమించుకొని పనులు చేపట్టినప్పటికీ లక్ష్యాలను సాధించలేకపోయారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం వంటి కారణాల వల్ల ఈ ప్రణాళిక కాగితాలకే పరిమితమైందనే చర్చ కేఎంసీలో ఉంది.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

నగరంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధుల్లో సైతం పారిశుద్ధ్యం సరిగా లేదు. ఖాళీ స్థలాల్లో అపరిమితంగా పెరిగిన పిచ్చిమొక్కలు దోమలకు ఆవాసంగా మారాయి. చాలా చోట్ల మురుగునీటి కాలువలు పూడిక తీయకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వచ్చి చేరుతోంది. దీనివల్ల తీవ్ర దుర్వాసనతో పాటు అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన సమయాన ఈ సమస్య మరింత తీవ్రమవుతుందని ప్రజలు వాపోతున్నారు. పారిశుద్ధ్య సమస్యలపై ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లభించడం లేదని ఆరోపిస్తున్నారు.

నిర్వహణలో అలసత్వం..



నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఖాళీ స్థలాలు పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉన్నాయి. వంద రోజుల ప్రణాళికలో అధికారులు ఎక్కడా సరైన పనులు చేపట్టినట్లు కనిపించడం లేదు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి మురుగుమయంగా ఉన్నాయి. అధికారులు ప్రణాళికలు రూపొందించడంతో పాటు పర్యవేక్షణ చేయాలి.

– శోభ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నగర కార్యదర్శి

సుంకం రద్దు దేశానికే చేటు



సదస్సులో అభివాదం చేస్తున్న పార్టీ నేతలు

ఖమ్మంమయూరిసెంటర్: పత్తి దిగుమతిపై సుంకాన్ని రద్దు చేయడం దేశ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు, అఖిల భారత రైతుకూలీ సంఘం కేంద్ర కన్వీనర్ కెచ్చల రంగయ్య ఆరోపించారు. బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన నగరంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో రైతు సదస్సు నిర్వహించగా వారు మాట్లాడారు. గతంలో అమెరికా నుంచి దిగుమతి అయ్యే పత్తిపై 11 శాతం పన్ను విధించే మోదీ సర్కార్ ఇప్పుడు ఆ పన్నును ఎత్తివేయడంతో పత్తి సాగు చేయాలంటే జంకే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పెట్టుబడి ఆధారంగా పత్తికి రూ.10,076 ప్రకటించాలని ఆందోళనలు చేస్తున్నా.. పట్టించుకోకపోగా రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ఆరోపించారు. బలమైన రైతాంగ ఉద్యమాలు, ఆందోళనలు చేస్తేనే వ్యవసాయ రంగ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఈ సదస్సులో రైతు సంఘాల నేతలు దొండపాటి రమేష్, మాదినేని రమేష్, మలీదు నాగేశ్వరరావు, బజారి వెంకట్రామిరెడ్డి, పర్ష పద్మ, వి.కోటేశ్వరరావు, కొండపర్తి గోవిందరావు బొంతు రాంబాబు, కోలేటి నాగేశ్వరరావు, వై.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. తొలుత బైపాస్ రోడ్డులో సంఘం ఆధ్వర్యాన రైతులు భారీ ప్రదర్శన నిర్వహించారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న పార్ట్ టైం అధ్యాపకులు

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కళాశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులు ఐదు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వేతనాలు విడుదల చేయాలని కోరుతూ పార్ట్ టైం అధ్యాపకులు బుధవారం గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌రాకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ.. హెడ్ ఆఫీస్‌లో రెన్యువల్ ఆర్డర్లు, ఫైనాన్స్ అప్రూవల్ వంటి కారణాలు చెబుతూ జీతాలు ఇవ్వకుండా మభ్యపెడుతున్నట్లు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో పార్ట్‌టైం అధ్యాపకులు శివశంకరాచారి, సత్యనారాయణ, ఓం ప్రకాష్, అశోక్, నాగరాజు దంతెనపల్లి, బాలరాజు, విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు వేతనాలు చెల్లించండి

ఖమ్మం సహకారనగర్: అరకొర వేతనాలతో ఉపాధ్యాయులుగా, కేర్ టేకర్‌లుగా, వార్డెన్లుగా వివిధ రకాల విధులు నిర్వహిస్తున్న కేజీబీవీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఎస్ఎస్ఏ ఉద్యోగుల వేతనాలను ప్రతి నెలా ఆలస్యంగా చెల్లిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్ట శేఖర్‌రావు, ఆర్.రంగారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇకనైనా ఆగస్టు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వద్దు



ఆరా తీస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంఅర్బన్: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో స్వచ్ఛతపై ఎలాంటి రాజీలేదని, నిర్లక్ష్యం చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య హెచ్చరించారు. బుధవారం నగరంలోని 10, 11, 12వ డివిజన్లలో పర్యటించి శానిటేషన్ పనులను, వర్కర్ల హాజరు పట్టికను పరిశీలించి పని వివరాలను అడిగి తెలుసుకున్నారు. డోర్–టు–డోర్ చెత్త సేకరణ, కాలువల శుభ్రత, తదితర వివరాలను తెలుసుకున్నారు. 11వ డివిజన్‌లో కాలువ పక్కన పిచ్చిమొక్కలు, చెత్త పేరుకుపోవడాన్ని గమనించి సంబంధిత జవాన్, సానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్పొరేషన్ పరిధిలో సిబ్బంది మార్పు

ఖమ్మంమయూరిసెంటర్: గతంలో పనిచేసిన వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు కేఎంసీ పరిధిలో జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, ఇతర పలు విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా జీపీఏలుగా నియామకం కావడంతో ఈనెల 6న రిలీవ్ అయ్యారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పాలనా సౌలభ్యం కోసం కార్పొరేషన్ పరిధిలో అంతర్గతంగా మార్పులు చేయగా.. వీరంతా బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, జవాన్లు, ఆయిల్ మాన్‌లుగా విధులు నిర్వహించనున్నారు. వీరిలో సీనియర్ అసిస్టెంట్‌గా బి.రామచందర్, బిల్ కలెక్టర్లుగా సీహెచ్.రాములు, ఎ.అవినాష్, వార్డు ఆఫీసర్లుగా డి.అప్పయ్య, లింగరాజు, చట్టు సుదర్శన్, పి.సతీష్, వై.వినోద్ కుమార్, జి.వంశీకృష్ణ, డి.వెంకటేశ్వర్లు, కొల్లి శైలజ, వేముల మురళి, తోకల ప్రత్యూష, కొమ్మిని అనురాధ, బలవంతపు రాజా, డి.అర్చన, నోసినరాజు, భూక్య నిరోష, , వి.హనీష, కె.యాదగిరి, బండి సంధ్య, ఎ.ప్రేమ్‌కుమార్‌రెడ్డి, నెల్లూరి సింధు, ఎస్.సందీప్, ఎం.నాగరాజు, ఎ.వసంత, ఎం.చరణ్, పి.గణేష్, టి.శివ, ఎం.సుధాకర్‌రావు, భూక్యా ఉపేందర్, డి.ఉపేందర్, ఉమేష్‌చంద్ర, ఎం.వేణు, బి.సౌమ్యశ్రీ, ఎస్‌కె.బిక్కెన్‌సాహెబ్, సీహెచ్.వెంకటేశ్వర్లు, జి.వెంకటేష్ పనిచేయనున్నారు. అలాగే జవాన్‌గా జి.ఉపేందర్, ఆయిల్‌మాన్‌గా ఎస్.వెంకటేశ్వర్లు విధులు నిర్వర్తించనున్నారు.

పారదర్శక పాలనకు చర్యలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో కేఎంసీ కమిషనర్ లాగిన్ ద్వారా వచ్చే ఎల్ఆర్ఎస్, సెల్ఫ్ అసెస్‌మెంట్, మ్యుటేషన్, బిల్డింగ్ పర్మిషన్ తదితర దరఖాస్తులపై పూర్తి పారదర్శకతను తెచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కేఎంసీకి వచ్చిన 100 దరఖాస్తుల్లో రాండమ్‌గా 20 దరఖాస్తులను ఎంపిక చేసి కమిషనర్ పేషీ నుంచి నేరుగా దరఖాస్తుదారులను ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఎటువంటి లంచం ఇవ్వకుండానే సక్రమంగా సేవ అందించబడిందా? లేదా అనే ప్రశ్నలు అడిగారు. అవినీతి లేని సేవలు అందించబడేలా చర్యలు కొనసాగుతున్నాయి.

డీఆర్‌ఓకు వినతి

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా వ్యవసాయ కూలీలకు రూ.12వేల ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను వెంటనే ఇవ్వాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రేపాకుల శివలింగం, తిమ్మిడి హనుమంతరావు అన్నారు. ఈమేరకు బుధవారం ఖమ్మం కలెక్టరేట్ డీఆర్‌ఓ పద్మజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ కూలీలకు రూ.18 వేలు ఇవ్వాలని, స్థలం కేటాయించి ఇంటి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 చెల్లించాలని, బీడీ, గీత, చేనేత, వృద్ధులకు ఏడాదికి రూ.48 వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గంటా శ్రీనివాసరావు, కూరాకుల నరసయ్య, కొల్లి నాగేశ్వరరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, కేలోతు పాపారావు, వీర్ల వెంకటఅప్పారావు, చల్లా రాజు, చేపల సత్యనారాయణ, సురేష్, ధారమల్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నివాళి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని రోటరీనగర్ ఫంక్షన్‌హాల్‌లో ప్రముఖ విద్యావేత్త, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సూర్యదేవర జానకి రామారావు సతీమణి నీరజాదేవి సంస్మరణ సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్, వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

అరుదైన శస్త్రచికిత్స

ఖమ్మం మామిళ్లగూడెం: శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న ఖమ్మం మమత ఆస్పత్రి రోడ్డు ప్రాంతానికి చెందిన 79ఏళ్ల వృద్ధురాలు మేదరపు జానికమ్మకు అరుదైన శస్త్రచికిత్స అందించినట్లు హైదరాబాద్ సోమాజీగూడ యశోద హాస్పిటల్ పల్మోనాలజీ బృందం తెలిపింది. బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో యశోద హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ బి.విశ్వేశ్వరన్ దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆమెకు అధునాతన పల్మనరీ, కార్డియాక్ కేర్ అందించబడిందని, ఎన్‌టీజీ ఇన్ఫ్యూషన్, ఇన్సులిన్ ఇన్ఫ్యూషన్, పొటాషియం కరెక్షన్ చేయబడిందన్నారు. ఈ సమావేశంలో పేషంట్ మేదరపు జానికమ్మ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాలు నిర్వహిస్తామని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ, గురుకులాల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శులు శివనాయక్, వంశీ, గోపీ, పవన్, నరేందర్, నాగరాజు, ప్రతాప్, రాకేష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి సమాచారం

➡ మున్నేరు బ్రిడ్జిపై రాకపోకలు బంద్

ఖమ్మంక్రైం: నగరంలోని కాల్వొడ్డు మున్నేరు పాత బ్రిడ్జిపై నేటి నుంచి ఈనెల 14 వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు రాకపోకలు నిలుపదల చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ బుధవారం తెలిపారు. తీగల వంతెన నిర్మాణం కోసం భారీయంత్రాలను ఉపయోగిస్తున్న నేపథ్యాన బంద్ చేస్తున్నందున ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణం కొనసాగించగలరని అధికారులు విజ్ఞప్తి చేశారు.

➡ జన సురక్షా ప్రచార శిబిరం

కూసుమంచి: మండలంలోని నేలపట్ల గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన గురువారం జన సురక్షా ప్రచార శిబిరాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక బ్రాంచ్ మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంకు ప్రాంతీయ డైరక్టర్ చిన్మయ్ కుమార్, జనరల్ మేనేజర్ సుప్రభాత్‌తో పాటు పలువురు ఎస్‌బీఐ ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు.

➡ దుకాణాలకు వేలం పాట

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాల శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయానికి సంబంధించిన దుకాణాలకు గురువారం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాకారి నల్లమోతు శేషయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి, పులిహోర, లడ్డూ అమ్ముకొనుటకు, కొబ్బరి చిప్పలుపోగు చేసుకొనుటకు, తలనీలాలు కొనుగోలు చేయుటకు వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన పాటదారులు సకాలంలో డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నాలని కోరారు.

➡ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు..

ఖమ్మంమయూరిసెంటర్: సాయుధ పోరాట వీరగాధలను నేటి తరానికి తెలియజేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యాన నేడు(గురువారం) నుంచి సాయుధ తెలంగాణ పోరాట వారోత్సవాలను నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని జెడ్పీ సెంటర్ నుంచి మోటార్ సైకిల్ ర్యాలీతో ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 13న ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగే సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్‌కె.జానిమియా తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కార్యవర్గ సభ్యులు బీ.జీ.క్లెమెంట్, రామాంజనేయులు, మల్లేష్, నర్సింహారావు, నాగేశ్వరరావు, కొండయ్య, యాకూబ్ పాల్గొన్నారు.

15న రిక్రూట్‌మెంట్ డ్రైవ్

ఖమ్మంఅర్బన్: తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సెంటర్‌లో ఈ నెల 15న నుంచి టెలీ పెర్ఫామెన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోంది. హైదరాబాద్ ప్రాంతంలో పనిచేయడానికి కస్టమర్ సపోర్ట్ అసోసియేట్‌లు, కంటెంట్ మోడరేటర్లు, అనలిస్ట్ పొజిషన్స్ పోస్టుల భర్తీ కోసం డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా టాస్క్ మేనేజర్ పూసాల దినేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్ పూర్తి చేసిన వారు ఇల్లెందు క్రాస్‌రోడ్డులోని టాస్క్ రీజినల్ సెంటర్‌ను సంప్రదించాలన్నారు.

ఐలమ్మ ధైర్య సాహసాలు శ్లాఘనీయం

తెలంగాణ విమోచన పోరాటంలో చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలు, త్యాగం శ్లాఘనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు ఆమె సేవలకు కొనియాడి, ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

– సాక్షినెట్‌వర్క్



ఖమ్మం కేఎంసీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మేయర్, కమిషనర్, తదితరులు



ఖమ్మం మామిళ్లగూడెం: వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో..



తిరుమలాయపాలెంలో జోహార్లు అర్పిస్తున్న ఐద్వా నాయకులు



నేలకొండపల్లిలో పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

చైర్మన్ నియామకం ఎన్నడో..?

- నూతన కమిటీని ప్రకటించక ఏడాది
- నామమాత్రంగా జాతర ఉత్సవాలు
- పదవి కోసం ఆశావహుల ఎదురుచూపులు
- పూర్వ వైభవానికి కృషి చేయాలని భక్తుల వేడుకోలు



అసంపూర్తిగా నిలిచిపోయిన శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయం

కామేపల్లి: ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారి కొత్తలింగాల క్రాస్‌రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయ ధర్మకర్త మండలి నియామకం ముందుకు పడడం లేదు. ధర్మకర్త మండలి పదవీ కాలం ముగిసి ఏడాది అవుతున్నా నేటికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కొత్త కమిటీ కోసం ఇప్పటికే రెండుసార్లు ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ నోటిఫికేషన్ జారీ చేసినా.. ఏడుగురు డైరెక్టర్ పదవులకు ఎవరూ దరఖాస్తు చేయలేదు. దీంతో ప్రతి ఏటా అమ్మవారికి ఉగాదికి నిర్వహించే జాతర ఉత్సవాలు నామమాత్రంగా జరుగుతూ పునర్నిర్మాణ పనులు అలాగే నిలిచిపోతున్నాయి.

ఎమ్మెల్యేనే ఫైనల్..

శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయ కమిటీ పదవులు ఇల్లెందు ఎమ్మెల్యే అనుకున్న వారికే దక్కుతాయి. ఈ పదవులకు సంబంధించి ఎమ్మెల్యే ఇంకా నిర్ణయం తీసుకోలేదని, అందుకే ధర్మకర్త మండలి ఏర్పాటులో జాప్యం జరుగుతుందని తెలుస్తోంది. కాగా, చైర్మన్ పదవి కోసం పలువురు కాంగ్రెస్ నాయకులు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. చైర్మన్ పదవి ఆశిస్తున్న వారంతా ఎమ్మెల్యే ఆశీస్సుల కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఏదీఏమైనా వెంటనే దేవాలయ ధర్మకర్త మండలి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బాల దేవాలయంలోనే అమ్మవారు..

కోరిన కోర్కెలు తీర్చే శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయ పునర్నిర్మాణ పనులు వివిధ కారణాల వల్ల కొన్నేళ్లుగాఅసంపూర్తిగా నిలిచిపోవడంతో బాల దేవాలయంలోనే అమ్మవారు కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తున్నారు. ఇప్పటికైనా నూతన ధర్మకర్త మండలి కమిటీని నియమించి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేసి అమ్మవారి ప్రతిష్ఠాకార్యక్రమం వైభవంగా నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు.

పూర్వవైభవం తీసుకురావాలి



కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారు శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయ పునర్నిర్మాణం పూర్తి చేయకుండా బాల దేవాలయంలోనే పూజలు చేయడం సరైంది కాదు. ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి అమ్మవారికి పూర్వ వైభవం తీసుకురావాలి.

– జర్పుల రామారావు, రామకృష్ణాపురం

ఎవరూ దరఖాస్తు చేయలేదు..

ధర్మకర్త మండలి ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే రెండుసార్లు నోటిఫికేషన్ జారీ చేసినా ఎవరూ దరఖాస్తు చేయలేదు. దీంతో ధర్మకర్త మండలి ఏర్పాటు నిలిచిపోయింది.

– నల్లమోతు శేషయ్య, ఆలయ నిర్వాహణాధికారి